క్లుప్తంగా

మత్స్య సంపదపై అవగాహన



బాదంపూడి మత్స్య అభివృద్ధి కేంద్రంలో విద్యార్థులు

ఉంగుటూరు: మండలంలోని బాదంపూడి మత్స్య కేంద్రాన్ని పెంటపాడు గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం సందర్శించారు. ఇక్కడ చేప పిల్లల ఉత్పత్తి, పెంపక, బ్రీడింగ్ తయారీపై మత్స్య కేంద్రం బాధ్యురాలు భార్గవి అవగాహన కల్పించారు.

అన్నదానానికి విరాళం



అన్నదానానికి రూ.50 వేలు విరాళం అందిస్తున్న తపన చౌదరి

పెదపాడు : మండలంలోని అప్పనవీడు అభయాంజనేయస్వామి దేవస్థానంలో ప్రతి మంగళవారం నిర్వహించే అన్నదానానికి రూ.50 వేల విరాళాన్ని గారపాటి సీతారామంజనేయ చౌదరి (తపన చౌదరి) అందించారు. ఈ మొత్తం చెక్కును తపన పౌండేషన్ తరుపున ఆలయ ఈఓ, ఆలయ కమిటీ చైర్మన్‌లకు అందించారు. ఈ సందర్భంగా చౌదరిని దుశ్శాలువతో సత్కరించి అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భూషణం, అర్చకుడు రామాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఈఓ రవీంద్రభారతి

ఉంగుటూరు: పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని డీవైఈఓ రవీంద్రభారతి సూచించారు. గురువారం స్థానిక మండల విద్యావనరుల సమావేశపు హాల్లో ఎంఈఓ-2 అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమావేశంలో డీవైఈఓ మాట్లాడారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, గుడ్లు, చిక్కీ, రాగిజావ నాణ్యతగా ఉండాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జీఈఆర్ సర్వేను పూర్తిచేయాలన్నారు. ఉంగుటూరు, కైకరం, నారాయణపురం, బాదంపూడి హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయులు టి.మీనాకుమారి, శ్రీనివాసకుమార్, కె.రాంబాబు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

పెదవేగి : మండలంలోని విజయరాయి శివారున వెలసిన రామలింగేశ్వరస్వామి వార్కి అదే గ్రామానికి చెందిన పులగం శివారెడ్డి శివకుమారి దంపతులు, వారి కుమారుడు నరేంద్రరెడ్డి, కోడలు రజిత రూ.50 వేల విలువైన వెండి కిరీటాన్ని గురువారం సమర్పించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు, దేవస్థాన చైర్మన్ ఎన్ నాగేశ్వరరావు, అర్చకుడు టీవీ భాస్కరరావు పాల్గొన్నారు.

పెట్రోలు బంకులను తనిఖీ చేయాలి



ఆశ్రం సమీపంలోని పెట్రోలు బంకులో రిపేరులో ఉన్న గాలి మెషీన్

దెందులూరు: పెట్రోలు బంకుల్లో అధికారులు తనిఖీలు చేయాలని మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనికెల్ల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనాలకు గాలిపట్టే మిషన్, తాగునీరు, వాష్ రూమ్స్ ఉండాలన్నారు. అనేక పెట్రోలు బంకుల్లో తాగునీరు, గాలిపట్టే మెషీన్లు అందుబాటులో లేవని, వినియోగదారులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వ్యాపారం ధృక్పదంతో కాకుండా వినియోగదారులకు సౌకర్యాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చంద్రయాన్ సంబరాలు



దెందులూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



భీమడోలులో స్వీట్లు పంచుతున్న బీజేపీ నాయకులు

దెందులూరు: చంద్రయాన్-3 విజయవంతం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని దెందులూరు నర్సింగ్ విద్యార్థులు పేర్కొన్నారు. గురువారం కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాలు పట్టుకుని రెండో వార్డు, కళాశాల వీధిలో ర్యాలీ నిర్వహించారు. జయహో భారత్, జయహో ఇస్రో శాస్త్రవేత్తలంటూ నినాదాలు చేశారు. దెందులూరు సెయింట్ మెరిస్ యూపీ పాఠశాలలో చంద్రయాన్-3 విజయవంతంపై హెచ్ఎం సిస్టర్ టీనా మరియా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వీట్లు పంచారు. జయహో భారత్.. జయ్‌జయ్ ఇస్రో టీం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం టీనా మరియా మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం ఔనత్యాన్ని, కీర్తిప్రతిష్టలను, ప్రతిభను ఇస్రో శాస్త్రవేత్తలు తమ సత్తాను చాటడం యావత్తు భారతీయులందరికీ ఆదర్శనీయం, గర్వకారణమని పేర్కొన్నారు.

స్వీట్ల పంపిణీ

భీమడోలు: చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. బీజేపీ భీమడోలు మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ పటేల్, జిల్లా దళితమోర్చా అధ్యక్షుడు మత్తి శ్రీనివాస శాస్త్రి ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఇంటింటికీ వెళ్లి స్వీట్లు పంచారు. దుకాణాల వద్ద, ప్రధాన రహదారులపై జయహో చంద్రయాన్, సాహో ఇస్రో అంటూ నినదించారు. చంద్రయాన్ విజయంతో దేశ ఖ్యాతి ప్రపంచ దేశాల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడిందని, చంద్రుని దక్షిణ ధృవంపై దిగిన అద్భుత ఘట్టాన్ని ఇస్రో శాస్త్రవేత్తలు ఆవిష్కరించి ప్రయోగాల్లో తమ దైన ముద్ర వేశారని చెప్పారు. సుస్థిర పాలన, అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పేర్కొన్నారు.

గుండుగొలనులో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి

నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే వాసుబాబు

భీమడోలు: గుండుగొలనులో రూ.3.5 కోట్లతో చేపట్టిన 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తయింది. దీనిని శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ప్రారంభించనున్నారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా సుమారు 30 వేల మందికి విద్యుత్ సరఫరా కానుంది. 40 ఏళ్లుగా గుండుగొలను పరిసర గ్రామాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు చెక్ పడనుంది. గుండుగొలను, భోగాపురం, వడ్డిగూడెం, కోరుకల్లు, రత్నాపురం, పాతూరు, కురెళ్లగూడెం, ఎంఎంపురం గ్రామాల్లోని 10 వేల గృహ విద్యుత్, ఆక్వా విద్యుత్ కనెక్షన్లకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కానుంది. ఈ గ్రామాలకు ఇప్పటి వరకు భీమడోలు, పూళ్ల, పోతునూరు గ్రామాల్లోని సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రజలు నానాఅగచాట్లు పడుతున్నారు. వేసవిలో తరచుగా అధిక లోడుతో ట్రిప్ కావడంతో, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడం, విద్యుత్ వైర్లు దెబ్బతినడంతో గృహ అవసరాలకు విద్యుత్ అందకపోవడంతో పాటు మంచినీటికి తిప్పలు పడేవారు. విద్యుత్ సరఫరా కోసం రోడ్డెక్కి ఆందోళన చేసినా గత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపానపోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని సమస్యను పరిష్కరించారు. గ్రామంలో కోట్లాది రూపాయలు వెచ్చించి జగనన్న లేఅవుట్ వేసి పేదలకు స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించుకునేందుకు అనువుగా మౌలిక వసతులు కల్పించారు. సుమారు కోటి రూపాయలతో జగనన్న కాలనీకి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ విద్యుత్ అందించారు. గ్రామ ఉపసర్పంచ్, పార్టీ గ్రామ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు గ్రామంలోని నెలకొన్న విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే వాసుబాబు దృష్టికి తీసుకెళ్లారు. గుండుగొలనులో శిథిలావస్థకుచేరి తరచుగా ఇబ్బందులు గురిచేస్తోన్న 15 ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో రూ.60 లక్షలతో కొత్తవి ఏర్పాటు చేశారు. కొత్తగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గుండుగొలనులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సబ్‌స్టేషన్

సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత



సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో తాగునీటి సౌకర్యం, విద్యుదీకరణ, వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే నాని అన్నారు. గురువారం ఆయన కొమడవోలు జగనన్న కాలనీలో సుమారుగా రూ. 4.50 కోట్లు వెచ్చించి 33/11 కేవీ సామర్థ్యంతో ఏర్పాటుచేసిన విద్యుత్ ఉప కేంద్రాన్ని (సబ్‌స్టేషన్), ఏలూరు నగరంలోని 15వ డివిజన్‌లో రూ.81.74 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ నూతన చరిత్రను సృష్టిస్తూ పేదవారికి సొంతింటి కలను సాకారం చేసేలా అర్హులందరికీ స్థలంతో పాటు ఇళ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు ఇస్తుండగా, డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజ్‌తో మరో రూ.35 వేలు రుణం ఇచ్చేలా చర్యలు చేపట్టామని తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం, విద్యుదీకరణ, వీధిలైట్లు, రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఏలూరు నియోజకవర్గంలో పెద్దెత్తున ప్రభుత్వ వైద్యసేవలు అందుబాటులోకి తేవాలనే లక్ష్యంతో ప్రతి ప్రాంతంలోనూ వైఎస్సార్ యూపీహెచ్‌సీలు నిర్మిస్తునట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో అత్యాధునిక సౌకర్యాలు, నాణ్యమైన వైద్యచికిత్స అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల పోస్టులు భర్తీ చేశామని, నర్సింగ్, ఇతర సిబ్బంది పోస్టులను సైతం భర్తీ చేస్తూ ప్రజలకు మెరుగైన వైద్యం చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. కార్యక్రమాల్లో ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు తంగెళ్ల రాము, ఆరేపల్లి రాధిక, పార్టీ నాయకులు ఆరేపల్లి సత్తిబాబు, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆశ, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, సుంకర చంద్రశేఖర్, పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

ఏలూరు(ఆర్ఆర్‌పేట) : ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ అన్నారు. సత్రంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను గురువారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. తరగతులు, విద్యా బోధన, పారిశుధ్యం, టాయిలెట్ల నిర్వహణ, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు తదితర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, ఏటా విద్యారంగానికి వేలాది కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో నాడు - నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అమ్మఒడి, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, విద్యార్థులకు ప్రతి మూడు నెలలకు ఒక్కసారి ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత, దృష్టి లోపం వంటి సమస్యలకు వెంటనే చికిత్స, మందులు అందిస్తున్నరని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ బాగా పెరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. విద్యార్థులకు రక్తహీనత నివారణ మాత్రలను జెడ్పీ చైర్‌పర్సన్ స్వయంగా వేశారు. పాఠశాల టాయిలెట్ల నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని శైలజ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ విజేష్, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పాల్గొన్నారు.



సత్రంపాడులోని జెడ్పీ స్కూల్‌లో తనిఖీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

నేడు సీఆర్ఆర్‌లో మెగా జాబ్ మేళా

పెదపాడు : సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ మేళాలో పాల్గొని ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందాలని కోరారు. సీడాప్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ వారు నిర్వహించే ఈ జాబ్ మేళాలో పదో తరగతి నుంచి బీటెక్ వరకు చదివిన యువతీ యువకులు దరఖాస్తుచేసుకోవాలని సూచించారు. ఈ మేళాలో 30కి పైగా కంపెనీలు రెండు వేలకు పైగా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు.

దేశవ్యాప్తంగా మరోదశ రైతు ఉద్యమం

ఏలూరు (టూటౌన్): దేశవ్యాప్తంగా రైతాంగ సమస్యలపై మరో దశ ఉద్యమానికి సమాయత్తం కావాలని కర్షక, కార్మిక అఖిలభారత సదస్సు పిలుపు నిచ్చింది. న్యూఢిల్లీలోని బల్కటోర స్టేడియంలో గురువారం ఏర్పాటుచేసిన జాతీయ సదస్సులో ఏలూరు జిల్లా నుంచి రైతు సంఘం కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రతినిధిగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగించిందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు.

పెద్దింట్లమ్మ సేవలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



కేదవరంలో పెద్దింట్లమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: మండలంలోని కేదవరం గ్రామంలో కొల్లేటి పెద్దింట్లమ్మ జాతరలో గురువారం ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పూజలు చేశారు. ఆలయ గ్రామాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే, పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జి)కి వైఎస్సార్‌సీపీ నాయకులు బుద్దా అర్జున, పెనుగంటి అప్పారావు, నల్ల సత్తిపండు, పిల్లా శ్రీనివాస్ స్వాగతం పలికారు. సర్పంచ్ బోదుల స్వరూప్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల అగ్నిప్రమాద బాధితుడు మళ్ల రంగారావుకు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి రూ.10 వేలు సాయం అందించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. ఉండ్రాజవరం గ్రామంలో ఎంపీటీసీ సున్నా నరేష్ బావ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దుల వినోద్ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఎంపీటీసీ సున్నా నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



అన్నేవారిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, సిబ్బంది

భీమడోలు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమంటూ దుద్దేపూడి పంచాయతీ పరిధిలోని అన్నేవారిగూడెం యూపీ పాఠశాల చిన్నారులు, వివిధ శాఖల సిబ్బంది బేటీ బచావో, బేటి పడావో అంటూ గ్రామంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం అంటూ నినదించారు. వివాహ వయస్సు 18 ఏళ్ల వరకు చదివించాలని, వారికి అక్రమంగా వివాహాలు చేస్తే బాలల హక్కుల చట్టం, బాల వివాహాల చట్టాలు కఠినంగా శిక్షిస్తాయని మహిళా పోలీస్ సుజాన వివరించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఐరన్ మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎస్‌కే మస్తాన్, ఏఎన్ఎం సిబ్బంది ఎస్.సునీత, అంగన్‌వాడీ టీచర్ రత్నకుమారి, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, రోడ్డు పనుల పరిశీలన



పెదదళితవాడలో రోడ్డు, డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి రూ.కోటీ 30 లక్షలతో స్థానిక పెదదళితవాడలో డ్రెయినేజీ, సిమెంట్ రోడ్లు నిర్మిస్తున్నారని వైఎస్సార్‌సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఈ పనులను గురువారం ఆయన పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితవాడల అభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితవాడను విస్మరించారని ఆరోపించారు. అనంతరం స్థానికుల సమస్యలను తెలుసుకుని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, జిల్లా కార్యదర్శి చల్లామేరీరాజు, జిల్లా కమిటీ సభ్యులు కొంగర రత్నకుమార్, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, ఎంపీటీసీలు తోట విజయకుమారి, పులిపాటి ఆనంద్, వార్డు మెంబరు చల్లా రాజేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు కామిరెడ్డి బాలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాసుల పంపిణీ

ఉంగుటూరు: ప్రభుత్వం కల్పిస్తోన్న వసతులు సద్వినియోగం చేసుకుని విద్యలో మరింతగా రాణించాలని ఉభయగోదావరి జిల్లాల ట్రాన్సుకో విజిలెన్స్ ఆఫీసర్ వి.రవికుమార్ అన్నారు. గురువారం కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 155 మంది విద్యార్థులకు ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో సిబ్బంది పంపిణీ చేశారు. పాస్‌లు తయారికి అయిన ఖర్చును పెద్దిరెడ్డి వేణుగోపాల కృష్ణప్రసాదరావు, శేషవేణి దంపతులు జ్ఞాపకార్థం ముత్తంగి వేణుగోపాల్ అందజేశారు. హెచ్ఎం జి.ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, ఆర్టీసీ డిపో పీఆర్వో దొంతల విజయకుమార్(బోసు), మానవత మండల అధ్యక్షుడు జి.రవికుమార్, సహయ కార్యదర్శి కోనే సత్యనారాయణ, మానవత చైర్మన్ గుణ్ణం బుల్లబ్బాయి, ఏఎంసీ మాజీ చైర్మెన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, ఉపసర్పంచ్ మట్టా మురళీ, బస్సుపాసులకు సహకరించిన వేణుగోపాల్‌ని శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఏలూరు టౌన్: ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని ఉప రవాణా కమిషనర్ ఎస్ శాంత కుమారి సూచించారు. గురువారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ ప్రాంతంలో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శాంతకుమారి మాట్లాడుతూ జిల్లా రహదారి భద్రతా సమావేశంలో జిల్లా కలెక్టర్, రహదారి భద్రతా కమిటీ చైర్మన్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు హెల్మెట్ వినియోగంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. హెల్మెట్ ధరించక పోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలై మృత్యువాతకు గురవుతున్నారని హెచ్చరించారు. ఏలూరు జిల్లాలో రహదారి ప్రమాదాల శాతం తగ్గించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రాంతీయ రవాణా అధికారి కె.శ్రీహరి, మోటారు వాహనాల తనిఖీ అధికారులు కె.విజయ రాజు, జి.ప్రసాదరావు, కేవీఎస్ ప్రసాదు, వై.సురేష్ బాబు, పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వివేకానంద మాటలు ఆచరణీయం

ఏలూరు (టూటౌన్): స్వామి వివేకానంద మాటలు నేటికీ ఆచరణీయమని రామకృష్ణ మిషన్ విజయవాడ కార్యదర్శి స్వామి వినిశ్చిలానంద అన్నారు. వట్లూరులోని సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం అనే అంశంపై గురువారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని వివేకానంద జీవిత విశేషాలను వివరించారు. వివేకానందను మండుతున్న సూర్యగోళంగా వ్యాఖ్యానించారు. దేశం గురించి ప్రపంచానికి తెలియజేసింది వివేకానందుడని, భారత దేశాన్ని భారత మాతగా పూజించాలని చాటి చెప్పారని వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా కొనియాడుతోన్న వ్యక్తి స్వామి వివేకానంద అని అన్నారు. రేపటి భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని చెప్పారు. స్త్రీ శక్తి స్వరూపిణి అని వివరించి ఒక వివేకానంద, రామకృష్ణ పరమహంస, సుభాష్ చంద్రబోస్ లాంటి దేశ భక్తిని కలిగిన మహనీయులను ఇవ్వగల శక్తి స్వరూపిణిలు స్త్రీలని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.ఈశ్వరి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ కె.లక్ష్మీరఘూన్సి, ఎన్ఎస్ఎస్ తెలుగు విభాగం అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

తాగునీటి పంపింగ్ వ్యవస్థ పరిశీలన

ఏలూరు రూరల్: మొండికోడు రిజర్వాయర్ వేగంగా నింపేందుకు మరో మోటార్ ఏర్పాటుచేయాలని ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ బీవీ గిరి, ఏఈ శ్రీకాంత్‌తో కలిసి ఎంపీపీ దెందులూరు వంతెన వద్ద మొండికోడు రిజర్వాయర్ పంపింగ్ వ్యవస్థను పరిశీలించారు. మొండికోడు రిజర్వాయర్ నీటి మట్టం తగ్గిపోవడంపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారని, ఈ నేపథ్యంలో పంపింగ్ వ్యవస్థ వద్ద లోటుపాట్లను పరిశీలించినట్టు చెప్పారు. మరో 15 హార్సుపవర్ మోటార్ ఏర్పాటుచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు. ట్యాంక్ శుభ్రం చేయాలని, పంపింగ్ వ్యవస్థ వద్దకు నిరంతరం విద్యుత్ సరఫరా కొనసాగేలా అధికారులు పరివేక్షించనున్నట్టు చెప్పారు. కొద్దిరోజుల్లో రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి కొల్లేరు గ్రామాల ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా కొనసాగిస్తామని ఎంపీపీ వివరించారు.

జైభీమ్ ఆర్మీ అధ్యక్షుల నియామకం

ఏలూరు (టూటౌన్): జైభీమ్ ఆర్మీ ఏలూరు నగర అధ్యక్షుడిగా చాబత్తుల ఏతిధ్య, ఉంగుటూరు నియోజకవర్గం అధ్యక్షుడిగా దాసరి సుభాకర్‌రావు నియమితులయ్యారు. స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో వీరిని నియమించారు. వీరికి నియామక పత్రాలను జై భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షుడు గొల్ల నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఐక్యతతోనే రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జైభీమ్ ఆర్మీ కమిటీలను నియమించనున్నట్టు తెలిపారు. సంస్థ సభ్యులు, నాయకులు గ్రామాల్లో పర్యటించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశించిన రాజ్యాధికారంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.